దళితుల భూ సమస్యను పరిష్కరించండి

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామంలోని దళితుల భూ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నేత ఎం.కృష్ణమూర్తి అధికారులను కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు కె.జయ, పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, చిన మేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ మంగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశానికి హాజరైన ఆయన.. 1970లో గ్రామంలోని 14 దళిత కుటుంబాలకు 22.80 ఎకరాలకు సంబంధించి, డీపట్టాలు మంజూరయ్యాయని, అప్పటి నుంచి ఆ భూములను వారు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంత మంది రైతులు కోర్టు ద్వారా ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకుని, దళితుల భూములు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ దశలో బాధిత దళితులంతా తమ భూమిని కాపాడుకునేందుకు అనేకసార్లు ఆందోళన చేయడం జరిగిందని, అయితే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు దళితులు సాగు చేస్తున్న భూమి మీదికి రైతులు వచ్చి ఘర్షణకు పాల్పడడం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. రెవెన్యూ అధికారుల జాప్యం కారణంగానే గ్రామాల్లో ఆ వర్గాల మధ్య తగాదాలు ఎక్కువవుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా, దళితులపై దాడికి పాల్పడిన రైతులపై కేసులు నమోదు చేయాలని కోరుతూ ఆయన బాధిత దళిత కుటుంబాలతో కలిసి పోలీస్స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమణ, మన్మధరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, ఎస్‌వి అమ్మన్న రావు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళితులు, సీపీఎం నాయకులు

క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి

పాలకొండ రూరల్ : ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. పాలకొండ - వీరఘట్టాం, శ్రీకాకుళం రహదారుల్లో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధారణ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు.

గాయత్రీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గాయత్రీదేవి

పాలకొండ: పట్టణ సమీపంలోని గాయత్రీదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రధానార్చకుడు చిట్టిబాబు శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం : వర్షాలు విస్తృతంగా కురుస్తున్నందున పొలాల్లో పంపుసెట్లు ఆన్ చేయడానికి వెళ్లే రైతన్నలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ డి.బాలాజీ సూచించారు. శుక్రవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో పలువురు రైతులతో మాట్లాడారు. పంపుసెట్ల వద్దకు వెళ్లేటప్పుడు పొడి దుస్తులతో వెళ్లాలని, చెప్పులు గాని బూట్లు గాని ధరించాలని సూచించారు. తెగి పడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ జి. సుధాకర్, సబ్ ఇంజినీర్ ఎ. అనిల్‌కుమార్, మురళి ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


- మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని ఈ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ వ్యాధుల బారిన పడకుండా పట్టణ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహించనున్నామని తెలిపారు. శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పార్వతీపురం పట్టణంలో డీసిల్టింగ్ పనులు జరుగుతున్న వేళలో సిల్ట్‌ను పూర్తిస్థాయిలో తీయించే విధంగా చూసుకోవాలని యాంటీ లార్వా స్ప్రేయింగ్ అన్ని వీధుల్లో జరిగేలా ఏఎస్ఎం బాధ్యత వహించాలని సూచించినట్లు తెలిపారు.

దుకాణాల దగ్గర డస్ట్‌బిన్‌లు..

ప్రధాన రహదారిలో ఉన్న దుకాణాల దగ్గర డస్ట్ బిన్స్ పెట్టించే విధంగా చూసుకోవాలని డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయని దుకాణదారులకు అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. అదే సమయంలో సచివాలయం ఎమినిటి సెక్రటరీలను ఉద్దేశించి ప్రతి రోజు వార్డుల్లో కుళాయిలు సరఫరా అయ్యే సమయంలో క్లోరినేషన్ టెస్టులు చేయాలని, వాటర్ ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడాలని, ఏరియా వారీగా కుళాయి లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు వివరించారు.

మధ్యాహ్న భోజన వంటల పరిశీలన


మధ్యాహ్న భోజనఅమలు తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు వంటలు చేసే సమయంలో, విద్యార్థులకు భోజనాలు పెడుతున్న సమయంలో నిర్వాహకులు వ్యాధులనివారణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన వంటలను ఆయన పరిశీలించి ఆహార పదార్థాల రుచి చూశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా మండలంలోని అన్నిగ్రామాల్లో మధ్యాహ్న భోజన పథకం వంటల్లో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సీజన్‌లో అతిసార వ్యాధి ఎక్కువగా వచ్చే ఆస్కారం ఉన్నందున ముందుగా వంటలు చేస్తున్న నిర్వాహకులు చేతులకు గ్లౌజులు ధరించాలని, ఆహారపదార్థాలు తాజాగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రకసాద్, ఇన్‌చార్జి హెచ్ఎం, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేయండి


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

వీరఘట్టం : వృద్ధులు , వితంతువులు, దివ్యాంగులు, తదితరులకు ఇచ్చే పింఛన్లను జూలై ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే ఇంటికి వెళ్లి అందజేయాలని ఎంపీడీఓ ఎంవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 9,954 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వీరికి ప్రభుత్వం 6, 66, 77, 500 రూపాయలు మంజూరు చేసింది. అనారోగ్యం, ఇతర కారణాల వల్ల ఆస్పత్రుల్లో ఉన్న పింఛన్‌దారులకు కూడా పింఛన్ సొమ్ము అందించాలని సూచించారు.

ఇంటింటికీ వెళ్లి, పింఛన్లు ఇవ్వండి

గుమ్మలక్ష్మీపురం: జూలై 1వ తేదీన ఇంటింటికీ వెళ్లి, పింఛన్లు పంపిణీ చేయాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లను ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి, సాయంత్రంలోగా పూర్తి చేయాలని తెలిపారు. పెన్షన్లకు సంబంధించిన నగదును శనివారమే విత్‌డ్రా చేసుకోవాలని తెలిపారు.


సూచనలిస్తున్న ఎంపీడీవో జగదీష్‌కుమార్

తాగునీటి వనరుల్లో క్లోరినేషన్


కాశీపట్నంలో క్లోరినేషన్ జరిపిస్తున్న పంచాయతీ సిబ్బంది

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో గల అన్ని గ్రామాల్లో తాగునీటి బోరుబావుల వద్ద పంచాయతీ కార్యదర్శి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం క్లోరినేషన్ జరిపించారు. వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితమై, ప్రజలు డయేరియా బారిన పడకుండా నివారించేందుకు ముందుస్తుగా క్లోరినేషన్ జరిపిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఈ సందర్భంగా తెలిపారు. అలాగే నంద పంచాయతీలో సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్యకార్మికులు తొలగించారు. నంద ఏజెన్సీ గిరిజన పంచాయతీ కావడంతో, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుద్ధ్యపనులు జరిపిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహేష్ తెలిపారు.

వ్యాన్ ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు


మాట్లాడుతున్న సీఎస్‌డీటీ ఎన్.రమేష్‌బాబు

సీతానగరం: రేషన్ కార్డులున్న వారందరికీ పాతవిధానం(డోర్) ద్వారానే నిత్యావసర (రేషన్) సరుకులు పంపిణీ చేయనున్నామని సీఎస్‌డీటీ ఎన్. రమేష్‌బాబు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన డీలర్లతో నిత్యావసర సరుకుల పంపిణీ విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, అంగన్వాడీ కేంద్రాలకు నిర్దేశించిన గడువులోగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నామని చెప్పారు. అలాగే రేషన్ వినియగదారులందరికీ నిర్దేశించిన గడువులోగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ సరుకులు చేరే విధంగా రేషన్ డీలర్లు విధిగా ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద, వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే రేషన్ సరుకుల పంపిణీ విధానంతో జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫ్రైడే డ్రైడే

సీతానగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో ఫ్రైడే (శుక్రవారం) డ్రైడేగా ప్రకటించడంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పెదంకలాం పీహెచ్‌సీ మహిళా హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు.

ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదంకలాం, నిడగల్లు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది సంయుక్తంగా నిర్వహిస్తున్న పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో బ్లడ్‌బ్యాంకులు ఏర్పాటుచేయాలి

సాలూరు: గిరిజన ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో రక్తనిధి కేంద్రాలు ఏర్పాటుచేయాలని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి గోపాలరావు కోరారు. ఈ మేరకు మంత్రిని శుక్రవారం ఆయన సాలూరు పట్టణంలోని ఆమె స్వగృహంలో కలిశారు. గిరిజన ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో రక్తనిల్వలు లేకపోవడం వల్ల రక్తం కోసం విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లోని ఆస్పత్రులకు పంపించడంతో ఏజెన్సీ ప్రాంత రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ విద్యాభివృద్ధి అధ్యక్షుడు నాగేశ్వరరావు, సూర్యయాదవ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

గరుగుబిల్లి: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్‌పర్సన్ పి.దేముళ్లు అన్నారు. మండలంలోని లఖనాపురం గ్రామంలో చేస్తున్న నవధాన్యాల సాగును ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు వేసిన 40 నుంచి 45 రోజుల తర్వాత ఆ మొక్కలను నేలలో కలియదున్నాలని, అలా చేయడం ద్వారా నేల సారవంతం కావడంతో పాటు ప్రధాన పంటకు అవసరమైన అన్ని పోషకాలు నేల నుంచి లభిస్తాయన్నారు. రీజనల్ తీమోటిక్ లీడర్ కె.ప్రకాష్ మాట్లాడుతూ మెట్టు, పోడుభూముల్లో కొర్రలు, సామలు, ఆరికలు, జొన్నలు, రాగులు సాగు చేసుకోవాలని తెలిపారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

సీపీఐ ఆందోళన

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్న, ఆ పార్టీ కార్యకర్తలు కలిసి శుక్రవారం ఆందోళన చేపట్టారు. అక్కడి రోడ్డంతా గుంతలమయం కావడంతో పెదమేరంగి జంక్షన్ నుంచి జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, గుణుపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులంతా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది ప్రయాణించే ఈ రోడ్డును బాగు చేయాలని కోరారు.


రోడ్డు బాగుచేయాలని కోరుతున్న సీపీఐ నాయకులు

కొండాపురంలో ఫ్యామిలీ డాక్టర్

పాలకొండ: మండలంలోని కొండాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వెన్నెల రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి రోగాలు ప్రబలినా వెంటనే పీహెచ్‌సీని సంప్రదించాలన్నారు. ఆమెతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఎన్ఎన్ఎం కుమారి, ఆశా వర్కర్లు ఉన్నారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వెన్నెల

వెలుగు కార్యాలయంలో ఆడిట్

వీరఘట్టం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఆడిటర్ సీతారామయ్య శుక్రవారం ఆడిట్ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిపిన లావాదేవీలపై రికార్డులు, బిల్లులు పరిశీలించారు. ఆయనతో పాటు ఏపీఓ శివున్నాయుడు, సీసీ రాజా, ఎంఎం అధ్యక్షురాలు సుజాత, తదితరులు పాల్గొన్నారు.


వెలుగు కార్యాలయంలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

- డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన పార్వతీపురం మండలంలోని డోకిశీల పీహెచ్‌సీ, గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసి ఈ మధ్య నమోదైన జ్వరాలు, అందులో మలేరియాగా గుర్తించినవి, రోగుల ప్రస్తుత ఆరోగ్య స్థితి తదితర వివరాలపై ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన రక్త పూతలకు సత్వరమే పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్న గ్రామాల్లో సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్‌ను తనిఖీ చేసి నిర్వహణ సరిగా ఉండాలని, సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఐశ్వర్య, ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా కీటకజనిత వ్యాధుల కన్సల్టెంట్ రామచంద్రుడు, ఈఓ తిరుపతిరావు, సూపర్‌వైజర్ కృష్ణంరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి జగన్‌మోహన్‌రావు

అన్నిరంగాల్లో రాణించేలా బాలికలను తీర్చిదిద్దాలి

కొమరాడ: అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా రాణించేలా బాలికలను తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని విక్రంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం అనే అంశంపై కళాజాతా కళాకారులు శుక్రవారం అవగాహన కల్పించారు. బాలికల హక్కులు, బాలికల రక్షణకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు, బాల్యవివాహాలవల్ల కలిగే అనర్థాలు, పోక్సోచట్టం వంటి వాటిని బుర్రకథ, ఇతర ప్రదర్శనల ద్వారా కళాకారులు తెలియజేశారు. అనంతరం ఐసీడీఎస్ పీవో మాట్లాడుతూ బాలికల శారీరక, మానసిక వికాసంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలని, ప్రతిరోజూ వారికి పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శారదాంబ, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.


బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా కళాకారులు

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఇటీవల సాలూరు ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్‌లో భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐకి సంబంధించి, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లోని సీట్లన్నీ భర్తీ అయ్యాయని, ప్రస్తుతం ఫిట్టర్ ట్రేడ్‌లో 16, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లో 20, ఎలక్ట్రానిక్ ట్రేడ్‌లో 20, కోపా ట్రేడ్‌లో 42, డ్రెస్‌మేకింగ్ ట్రేడ్‌లో 19 సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారంతా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. దరఖాస్తులు అందజేసేందుకు జూలై 24వ తేదీ ఆఖరి గడువు అని, జూలై 25వ తేదీన సమీపంలోని ఏ ఐటీఐ వద్దకైనా వెళ్లి, వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

అనంతరం జూలై 27వ తేదీన ఉదయం 10 గంటలకు భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ నందు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

గుమ్మలక్ష్మీపురం: ఉద్యోగులకు వారు చేసిన మంచి సేవలే గుర్తింపునిస్తాయని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఎంఈవో-2 బిడే జనార్దన్‌నాయుడు ఉద్యోగ విరమణ పురస్కరించుకుని, స్థానిక బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపంలో వీడ్కోలు సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై, జనార్దన్‌నాయుడును సన్మానించి, విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. ఏ ఉద్యోగికైనా తన ఉద్యోగ కాలంలో చేసిన గొప్ప సేవలే వారికి కీర్తిప్రతిష్టలు తెచ్చిపెడతాయన్నారు. ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, మంచి ఉద్యోగులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు పలు సంఘాల నాయకులంతా కలిసి జనార్దన్‌నాయుడు దంపతులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో బి.చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో పి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జనార్దన్‌నాయుడు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

విద్యను ప్రైవేట్‌పరం కాకుండా చర్యలు తీసుకోండి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ విద్యను ప్రైవేట్‌పరం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు అమ్మ ఒడి పథకం వర్తింపజేయడం, కొన్ని వేలాది గ్రామాల్లో 3, 4, 5 తరగతులు అందుబాటులో లేకపోవడం వంటివి తల్లిదండ్రుల దృష్టిని ప్రైవేట్ పాఠశాలల వైపు తమ పిల్లలను మరలే విధంగా చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనవసరంగా అమలు చేస్తున్న యాప్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట ఆ సంఘ గౌరవాధ్యక్షుడు దుర్గారావు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రావు, సింహాచలం ఉన్నారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

డయేరియా ప్రబలకుండా చర్యలు

కురుపాం: గ్రామీణ ప్రాంతాల్లో డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఈఈ కె.నాగేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమైన ఆయన.. గ్రామీణ తాగునీటి పారిశుధ్య కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం పనులను సకాలంలో పూర్తిచేసి, ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందేలా చూడాలన్నారు. సమావేశంలో డీపీఎంయూ ఆర్.లక్ష్మణ, ఎం.రాఘవరావు, జి.విజయబాబు, బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న డీఈఈ నాగేశ్వరరావు

సీట్ల భర్తీకి లాటరీ

సీతంపేట: ఐటీడీఏ పరిధి కారిగూడలో గల మినీ గురుకులంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు స్థానిక గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం లాటరీ నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర సమక్షంలో మొత్తం 8 మంది విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, మినీ గురుకులం హెచ్ఎం ఎస్.హేమలత, తదితరులు పాల్గొన్నారు.


లాటరీ నిర్వహిస్తున్న అధికారులు

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్ : ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ ఉపకరణాల వినియోగంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌సుందర్ అన్నారు. మండలంలోని బాసూరులో శుక్రవారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయించారు. సర్పంచ్ ఎస్.గురునాయుడు ఆధ్వర్యంలో పలువురు రైతులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించారు.


ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న సిబ్బంది

చురుగ్గా పారిశుధ్య పనులు

గరుగుబిల్లి: మండలంలోని కొత్తపల్లి, కొత్తూరు, రావుపల్లి, పెద్దూరు, శివ్వాం గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాన రోడ్లలోని చెత్తాచెదారం తొలగించడంతో పాటు కాలువల్లోని మురుగు, పూడికలు తీయిస్తున్నారు. అలాగే మంచినీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తెలిపారు.

మనుముకొండలో..

భామిని : మండలంలోని మనుమకొండలో సర్పంచ్ నిమ్మల కేశవ పర్యవేక్షణలో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగాయి. వీధుల్లోని చెత్తలు తొలగించారు. అలాగే బత్తిలి పీహెచ్‌సీ వైద్యుడు దామోదరరావు సారథ్యంలో వైద్యారోగ్య సిబ్బంది తాగునీటి ట్యాంక్‌లలో క్లోరినేషన్ చేశారు. మురుగునీరు నిలువ ఉన్న చోట దోమలు, లార్వాలు వృద్ధి చెందకుండా మందు పిచికారీ చేశారు.

లుంబూరులో..

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరులో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ పరిధిలోని గరుగుబిల్లి, లుంబూరు శివారు కాలనీల్లో సర్పంచ్ టి. ఉపేంద్రకుమార్ ఆధ్వర్యంలో పనులు జరిగాయి. కాలువల్లో పూడికలు తొలగించడంతో పాటు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేశారు.


భామిని: తాగునీటి ట్యాంక్‌లో క్లోరినేషన్ చర్యలు


కొత్తపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు